క్లుప్తంగా

కళాశాల కోసం కొట్లాడుదాం..



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ సమితి జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్

బొంరాస్‌పేట: జూనియర్ కళాశాల కోసం పోరాడుదామని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. బొంరాస్‌పేట మండలంలో కాలేజీ లేకపోవడం వలన ఇంటర్ విద్య కోసం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆరేళ్ల క్రితం మండలానికి కళాశాల మంజూరైందని చెప్పిన పాలకులు, అధికారులు.. ఏర్పాటు చేయించడానికి చొరవ తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళాశాల ఏర్పాటుకు శ్రద్ధ చూపాలని కోరారు. లేని యెడలా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ధూపదీప నైవేద్యం ప్రొసీడింగ్ అందజేత



ప్రొసీడింగ్ ప్రతిని అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు అందజేసేందుకు పూజారులకు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి శనివారం ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిగి, దోమ, కుల్కచర్ల, పూడూర్ మండల పరిధి గ్రామ దేవాలయాల్లో నిత్యం పూజలు చేసేందుకు ప్రొసీడింగ్‌లను అందజేసినట్లు తెలిపారు. దేవాలయాల్లో పూజలు చేసే పూజారులకు ప్రభుత్వం పారితోషికం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, నాగిరెడ్డి, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో రైతులకు మేలు



విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ, వైస్‌ఎంపీపీ

బొంరాస్‌పేట: నాణ్యమైన విత్తనాలతోనే రైతులకు లాభం చేకూరుతుందని ఎంపీపీ హేమిబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలో వానకాలంలో సాగు చేసుకునేందుకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఈఓలు మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న విత్తనాలు అధిక దిగుబడిని ఇవ్వడంతో పాటు చీడపీడల బెడద అంతగా ఉండదని రైతులకు వివరించారు. సాగు విధానం, సస్యరక్షణ పద్ధతుల గురించి వెల్లడించారు. వైస్‌ఎంపీపీ శ్రావణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

దోమ: ఈ నెల 26న తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బస్సు యాత్రను చేపట్టనున్నామని, పేదలందరూ హాజరై విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటి నిర్మాణానికి ఖాళీ స్థలం, స్థలం ఉన్నవారికి రూ.10 లక్షల మంజూరుకు డిమాండ్ చేస్తూ.. ఈ యాత్రను చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకు ఈ యాత్రను కొనగిస్తూ పేదల పక్షాన నిలబడతామని చెప్పారు. సీపీఎం మండల అధ్యక్షుడు సత్తయ్య, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఆర్థిక సహాయం

కుల్కచర్ల: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు విశాల్‌కు శనివారం కుల్కచర్ల మండల ప్రజా సంఘాల నాయకుడు కుమ్మరి స్వామి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులకు ఆర్థిక సహాయం చేయడం వలన.. వారిని ప్రోత్సహించినట్లు ఉంటుందని తెలిపారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

మంజూరైన నిధులు

- మెరుగు పడనున్న రవాణా సౌకర్యం
- బీటీ నిర్మాణాలతో తీరనున్న వాహన దారుల కష్టాలు



బీటీరోడ్డు మంజూరైన రావులపల్లి మట్టిరోడ్డు

పరిగి: గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుంది. బీటీరోడ్లుగా మారి రవాణ సౌకర్యం మెరుగు పడనుంది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.17.05 కోట్ల నిధులను మంజూరు చేసింది. గత నెలలో ఎమ్మెల్యే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి.. నియోజకవర్గంలోని గ్రామాల రోడ్డు సౌకర్యం కోసం ఈ నిధులు తీసుకు వచ్చారు. దీంతో రోడ్డు మార్గం లేని 13 గ్రామాలకు బీటీని నిర్మించనున్నారు. ఇంతకాలం మట్టిరోడ్డుతో ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రజలు.. రోడ్ల మెరుగుకు మార్గం సుగుమం కావడంతో హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నిధులు, రహదారులు

పరిగి మండలం రావులపల్లి గ్రామానికి షాద్‌నగర్ రోడ్డు నుంచి రావుల పల్లి బీటీ నిర్మాణానికి రూ.1.85 కోట్లు కాగా.. దోమ మండలం బట్లచందారం గ్రామానికి మల్లెపల్లి రోడ్డు నుంచి బట్లచందారం రోడ్డుకు రూ.1.25కోట్లు కేటాయించారు. కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లి బీటీకి రూ.1.20 కోట్లు, చౌడాపూర్ మండలం వీరాపూర్ నుంచి మల్కాపూర్‌కు రూ.1.40కోట్లు, పరిగి మండలం నర్సయ్యగూడ రోడ్డుకు రూ.2.50కోట్లుగా వెచ్చించనున్నారు. పూడూర్ మండలం పీడబ్ల్యూబీ రోడ్డు నుంచి చింతల్‌పల్లి వరకు బీటీ నిర్మాణానికి రూ.1.40 కోట్లు, చౌడాపూర్ మండలం కన్మాన్‌కల్వ నుంచి కొత్తపల్లి గ్రామానికి రూ.1.30కోట్లు, గండీడ్ మండలం వెన్నచేడ్ నుంచి లింగాయపల్లి బీటీకి రూ.1.40కోట్లు, పూడూర్ మండలం నుంచి బాకాపూర్ గ్రామానికి రూ.1.05కోట్లను కేటాయించారు. చౌడాపూర్ మండలం మల్కాపూర్ నుంచి కామారం బీటీ నిర్మాణానికి రూ.1.25కోట్లు, చౌడాపూర్ మండలం నుంచి పుర్సంపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.60లక్షలు, దోమ మండలం దిర్సంపల్లి రోడ్డు నుంచి అనంతరెడ్డిపల్లి వరకు రూ.55లక్షలు, గండీడ్ మండలం గండీడ్ నుంచి జంగంరెడ్డిపల్లి వరకు నిర్మాణానికి రూ.1.30కోట్లు ఇలా మొత్తం 13 గ్రామాలకు బీటీ నిర్మాణానికి రూ.17.05కోట్ల నిధులు మంజూరయ్యాయి.

సౌకర్యం బాగుంటుంది



బొంరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లాలంటే మట్టి రోడ్డుపైనే ప్రయాణించాల్సి ఉంటుంది. రాత్రివేళ, వర్షాకాలం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్రామానికి బీటీ వేయనుండడం సంతోషకరమే. రోడ్డు మార్గం మెరుగు పడి రవాణా సౌకర్యం పెరుగుతుంది. తద్వారా గ్రామానికి రాకపోకలు పెరిగి గ్రామం అభివృద్ధి చెందుతుంది. – బాలు, బొంరెడ్డిపల్లి

మారనున్న గ్రామాల రూపురేఖలు



గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చిపోయాయి. కానీ చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పల్లెపల్లెకు బీటీ కావాలని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, రోడ్లు వేయిస్తున్నారు. మట్టిరోడ్లపై బీటీ పరుచుకోనుండడంతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. – హరిప్రియ, జెడ్పీటీసీ, పరిగి

అన్ని గ్రామాలకు రోడ్లు



ఇచ్చిన హామీ మేరకు అన్ని గ్రామాలకు బీటీ రోడ్డు వేయిస్తాం. నియోజకవర్గంలోని 13 గ్రామాల రోడ్ల నిర్మాణానికి రూ.17కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. రవాణ సౌకర్యం మెరుగు పరుస్తాం. – కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే

కాలినడకా కష్టమే..

ప్రయాణించాలంటే ప్రమాదం



బంట్వారం: మద్వాపూర్ టూ కోట్‌పల్లి రోడ్డు

బంట్వారం: ద్విచక్ర వాహనం కాదుకదా.. కనీసం కాలినడకనా వెళ్లలేని ఈ మట్టిరోడ్డుతో పరిసరప్రాంత ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బంట్వారం మండలం మద్వాపూర్ నుంచి ఈ రోడ్డు కోట్‌పల్లికి వెళ్తుంది. ఇది పంచాయతీరాజ్ పరిధిలోని రహదారి, సుమారు 4కిలో మీటర్లు ఉంటుంది. లింకు రోడ్డు కావడంతో వాహనదారులు ఎక్కువగా ఈ మార్గం గుండానే వెళ్తుంటారు. సల్బత్తాపూర్ మీదుగా వెళ్తే దూరం ఎక్కువవుతుందని, ఈ రోడ్డుపై పయనిస్తుంటారు. ప్రతి సోమవారం కోట్‌పల్లిలో సంత జరగడంతో మద్వాపూర్ గ్రామస్తులు ఎక్కువగా కాలినడకనే ఎంచుకుంటారు. వర్షాకాలంలో కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితని, ఇప్పటికైనా రోడ్డు దుస్థితిపై సంబంధిత అధికారులు స్పందించి, కనీసం మెటల్ రోడ్డు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్వానంగా..



పెద్దేముల్: నర్సపూర్-ఇందూరు రహదారి దుస్థితి

పెద్దేముల్: తాండూరు-సంగారెడ్డి, జహీరాబాద్ -తాండూరు ప్రధాన రహదారుల్లో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రహదారి పొడవునా ఏర్పడిన గోతుల్లో.. వర్షపు నీరు చేరి, బురదమయం కావడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దేముల్-బుద్దారం, తాండూరు-ఇందూరు మార్గం ధ్వంసమై.. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నర్సపూర్-ఇందూరు రోడ్డు దుస్థితి అదే విధంగా ఉంది. ఇదిలా ఉండగా.. రహదారుల విషయమై.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వ సభ్య సమావేశంలో తప్పితే.. మిగతా సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారుల జాడ లేదని స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పడం గమనార్హం. అసలే వర్షాకాలం.. ఆపై గుంతలు, అధ్వానంగా మారిన మార్గాల్లో ప్రయాణించాలంటే.. అది ప్రాణాల మీదకు తెస్తుందని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రహదారుల మరమ్మతుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

మండల విద్యాధికారి హరిశ్చందర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

దోమ: కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ హరిశ్చందర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. చదువు విషయంలో ఎలాంటి ఇబ్బంది వచ్చినా వెంటనే తమకు తెలపాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలకు అన్ని వసతులు కల్పిస్తుందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని నిర్వాహకులకు చెప్పారు. అవసరమైన పాఠ్యపుస్తకాలను అందించామని, అందని వారికి పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని, మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి పెద్దన్నలా.. అర్హులకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. కౌన్సిలర్లు రామస్వామి, కిరణ్‌పటేల్, అనంత్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, సురేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కుల్కచర్ల: చెరువులు, కుంటల్లో కొందరు అక్రమంగా నల్లమట్టిని తోడుతూ.. ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని, వాటికి అడ్డుకట్ట వేయాలని బొంరెడ్డిపల్లి మత్స్యకార సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు ఉపయోగకరంగా నిలిచే ఒండ్రు మట్టిని కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుకబట్టీలకు తరలిస్తున్నారని, తద్వారా రైతులు, మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ.. పర్మిషన్ లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం గ్రామ అధ్యక్షుడు మొగులయ్య, రాజు, దండు చంద్రయ్య, బుగ్గయ్య, గోపాల్, దండు హన్మంత్, నరేష్, రాములు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూచన్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

రూ.20 లక్షల నిధులు మంజూరు: సర్పంచ్

మర్పల్లి: ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం కోసం వైద్య ఆరోగ్య శాఖ నుంచి రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయని సర్పంచ్ జయ తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం మాట్లాడారు. బూచన్‌పల్లిలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మించాలని పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఇదే విషయం ఎమ్మెల్యే ఆనంద్‌కు చెప్పడంతో ఆయన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిధులు మంజూరు అయ్యాయని సర్పంచ్ చెప్పారు. సంబంధిత ఉత్తర్వు కాపీని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం అందజేసినట్లు వెల్లడించారు. ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే, మంత్రికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

తొమ్మిదేళ్ల మోదీ పాలన అద్భుతం

- దేశ ఖ్యాతిని పెంచిన ప్రధాని
- కేంద్ర పథకాలను తమవిగా ప్రచారం చేసుకుంటున్న బీఆర్‌ఎస్
- మహాజన్ సంపర్క్ అభియాన్‌లో బీజేపీ శ్రేణులు



మోమిన్‌పేట: ఏన్కతలలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న సదానంద్‌రెడ్డి

మోమిన్‌పేట: మోదీ హయాంలో దేశంలో ఎన్నో అద్భుతాలు జరిగాయని, ఏడు దశాబ్దాల కాలంలో జరగని అభివృద్ధి.. కేవలం తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో జరిగిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి చెప్పారు. 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం మోమిన్‌పేట మండలం ఏన్కతలలో ఆ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారంలో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశానికి విశ్వవ్యాప్తి గుర్తింపు తెచ్చారని తెలిపారు. ఒకే దేశం, ఒకే పన్ను అంటూ జీఎస్టీ విధానంతో అనేక మందిని పన్ను చెల్లింపుదారులుగా చేసిందని గుర్తుచేశారు. కరోనా సమయంలో దేశ ప్రజలకు మందులు పంపిణీ చేస్తూనే.. ప్రపంచ దేశాలను ఆదుకుందని పేర్కొన్నారు. అంతే కాకుండా ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కింద ఉచిత బియ్యం సరఫరా చేస్తుందని తెలిపారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశానికి విశ్వవ్యాప్తి గుర్తింపు లభించిందని, మారోసారి బీజేపీకి అండగా నిలవాలని సదానందరెడ్డి కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, ఓబీసీ అధ్యక్షుడు చంద్రయ్యగౌడ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ అసత్య ప్రచారం..

వికారాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తన పథకాలుగా ప్రచారం చేసుకుంటుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ఆరోపించారు. 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకూ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అందుతున్న పథకాల్లో కేంద్రం వాటా 80శాతం ఉందని చెప్పారు. పట్టణ ఇన్‌చార్జి శివప్రసాద్, సురేష్ స్వామి, ప్యాట శంకర్, రమేష్, ప్రభుగౌడ్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

కుల్కచర్ల: పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. కుల్కచర్ల మండలం ఘనపూర్‌లో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కేంద్రం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని, రాష్ట్రం అమలుచేస్తోన్న అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్రం వాటనే అధికంగా ఉందని చెప్పారు.

అంధకారంలో గ్రామాలు

తాండూరు రూరల్: గాలి దుమారంతో కూడిన భారీ వర్షం శనివారం రాత్రి కురవడంతో మండల పరిధి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం నెలకొంది. ముందస్తుగా విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేయడంతో ప్రజలు అంధకారంలో గడిపారు.

అరకల అద్దె రూ.1600

పెద్దేముల్: శనివారం పడిన చిరుజల్లులకు వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. విత్తులు విత్తేందుకు అన్నదాతలు మూకుమ్మడిగా సిద్ధం కావడంతో అరకలకు డిమాండ్ పెరిగింది. ఎండాకాలంలో సాగు భూములను 90శాతం ట్రాక్టర్ల ద్వారా దున్నుకోగా.. విత్తనాలు వేసే సమయంలో ఎడ్లు అద్దెకు దొరకక కర్షకులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో అరకకు రూ.1200 అద్దె ఉండగా, ప్రస్తుతం రూ.1500 నుంచి రూ.1600లు పలుకుతోంది. అయినా సమయానికి అరకలు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా మండలంలో కంది, పత్తి పంటలు అధికంగా సాగుచేయటంతో కూలీల కొరత ఉందని, ప్రభుత్వం ట్రాక్టర్ల ద్వారా విత్తనాలు చల్లే యంత్రాలను సబ్సిడీపై అందజేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎక్సైజ్ సీఐ

అనంతగిరి: వికారాబాద్ ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన రాగవీణ శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎక్సైజ్ సీఐ రాగవీణ

నృత్య పోటీల్లో రాణించిన తాండూరు కళాకారులు

తాండూరు: అంతర్జాతీయ డ్యాన్స్ ఫెస్టివల్‌లో తాండూరు డ్యాన్సర్లు ఉత్తమ ప్రతిభ చాటారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఇస్కాన్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో విజయవాడలో రథయాత్ర, రథ్‌ఫెస్ట్ పేరుతో నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40 దేశాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు. అయితే తాండూరు పట్టణానికి చెందిన ఏడీఎఫ్ఎస్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ అషు తన విద్యార్థులు అయిన 8మందిని పోటీలకు తీసుకెళ్లారు. ఈ పోటీల్లో తాండూరు ఏడీఎఫ్ఎస్ డ్యాన్స్ అకాడమి కళాబృందం అశోక్, మేఘన, ఆశ్రీత్, తనిక, శ్రీజ, భానుప్రియ, అక్షతలు ఉత్తమ ప్రతిభ చూపారు.

ఉచిత విత్తనాలను వినియోగించుకోండి



రైతులకు విత్తన సంచులను అందజేస్తున్న అధికారులు

పూడూరు: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మల్లేశం అన్నారు. శనివారం మండల కేంద్రం రైతు వేదికలో అన్నదాతలకు కంది విత్తనాలు అందజేసి మాట్లాడారు. రైతులు తప్పని సరిగా వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు, పాటించి అధిక దిగుబడులు పొందాలని ఆకాంక్షించారు. గ్రామ విత్తన పథకం కింద కంది మినీ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏఓ తులసిరాం, ఏఈఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

బంట్వారం: కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకుని, జూన్ 16వ తేదీ వరకు పట్టా పాసు బుక్‌లు పొందిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏఓ సంధ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన పత్రాలు పట్టా పాస్‌బుక్ లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన కార్యాలయ కాపి, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులు దరఖాస్తు ఫారానికి జతచేసి ఏఈఓలకు అందజేయాలని సూచించారు. సకాలంలో అర్జీ పెట్టుకుంటేనే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని ఆమె పేర్కొన్నారు. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముందు చూపు కొరవడి



రోడ్డు పక్కనే సగానికి సగం నరికి వేయడంతో దర్శనమిస్తున్న చెట్ల మొదళ్లు

వికారాబాద్ అర్బన్: ముందు చూపు లేని కారణంగా నాటిన మొక్కలు.. మానువయ్యాక గొడ్డలి వేటుకు నేల కూలుతున్నాయి. హరితహారంలో భాగంగా ఖాళీ స్థలాలు, రహదారులు, వెంచర్ల పక్కన నాటిన మొక్కలు.. నేడు పెరిగి తగిన ఫలితాలను ఇస్తున్నాయి. కానీ నాటిన మొక్కలు ఎక్కువగా విద్యుత్ తీగల కింద ఉండటంతో ఇప్పుడు అవి పెరిగి, విద్యుత్ తీగలను తాకుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం, లేదా ప్రమాదాలు జరుగుతాయన్న కారణంతో చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగిస్తున్నారు. పచ్చని కొమ్మలు నరికివేస్తుండడంతో పచ్చదనం లోపిస్తుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. మొక్కలు నాటే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే.. ఈ దుస్థితి రాదని అభిప్రాయ పడుతున్నారు. ఇక మీదట మొక్కలు నాటేటప్పుడు సరైన చోట నాటేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.